ఆశాజనకంగా వరి సాగు



పీడీ పాలెంలో కంకులతో వరి చేను

బుచ్చెయ్యపేట: ఖరీఫ్ వరిసాగు ఆశాజనకంగా ఉంది. ఏపుగా ఎదిగిన వరి పంట పొట్ట దశకు చేరి కంకులు వేస్తోంది.ఈ ఏడాది అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయశాఖ సిబ్బంది పలు గ్రామాల్లో వరి పంటను పరిశీలించి, దిగుబడులపై అంచనాలు తయారు చేశారు. వరి పంటకు ఆశించిన తెగుళ్లు, సస్యరక్షణ చర్యలపై రైతులకు తగిన సూచనలు,సలహాలు అందించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ఆరోగ్యకరమైన పంట దిగుబడి సాధించేలా అన్నదాతలకు సూచనలిచ్చారు.

ఎకరాకు 3 టన్నుల దిగుబడి : జిల్లాలో ఈ ఏడాది 53 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వరి సాగు చేపట్టారు. బుచ్చెయ్యపేట మండలంలో 6,025 ఎకరాల్లో, చోడవరం నియోజకవర్గంలో 25వేల ఎకరాల్లో ఈ ఏడాది వరి సాగు చేస్తున్నట్టు వ్యవసాయశాఖ సిబ్బంది గుర్తించారు. ప్రస్తుతం వరి పంట ఆశాజనకంగా ఉండడంతో ఎకరాకు 3 టన్నుల వరకు ధాన్యం దిగుబడి రావచ్చని శాస్త్రవేత్తలు,వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

పొట్ట దశకు చేను

నుడిదోమ, ఆకుచుట్టు తెగుళ్లు : పగటి పూట అధిక ఉష్ణోగ్రత,రాత్రిపూట శీతల వాతావరణం కారణంతో కొన్ని గ్రామాల్లో వరి పంటను తెగుళ్లు ఆశిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. నుడిదోమ, ఆకుచుట్టు తెగులు,పాముపొడ తెగులు ఆశిస్తుండడంతో సస్యరక్షణ చర్యలు చేట్టాలని రైతులకు సూచించారు. వరి పొలం గట్ల చుట్టూ ఉన్న గడ్డిని పూర్తిగా తొలగించి, తెగుళ్ల రాకుండా జాగ్రత్తలు పడాలని తెలిపారు.

పెరిగిన సాగు విస్తీర్ణం



జిల్లాలో సాధారణం కంటే మూడు శాతం ఎక్కువ విస్తీర్ణంలో వరి పంట సాగు అవుతోంది. ఎకరాకు మూడు టన్నుల వరకు ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశాం. వరి పంటకు తెగుళ్ల లేకపోయినా కొందరు రైతులు విచక్షణా రహితంగా రసాయ ఎరువులు వినియోగిస్తున్నారు. అలా చేయడం వల్ల నష్టం వస్తుంది. పంటకు తెగుళ్ల ఆశించినట్టయితే వ్యవసాయశాస్త్రవేత్తల సూచనల మేరకు ఎరువులు వినియోగించాలి. వరి పొట్ట దశలో ఉండడంతో అధిక పంట దిగుబడికి పొటాష్‌ను వినియోగించాలి.

– కె.రాజ్‌కుమార్, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త కొండెంపూడి

వరిలో పొటాష్ లోపం



వరి చేను ప్రస్తుతం చిరు పొట్ట దశకు చేరి, కంకులు వేయడానికి సిద్ధంగా ఉంది. పలు గ్రామాల్లో పొటాష్ లోపంతో వరి ఆకులు ఎర్రబడి కనిపిస్తున్నాయి. ఎకరాకు 15 నుంచి 20 కిలోల పొటాష్‌ను రైతులు వేయాలి. రసాయన మందులు ఎక్కువగా వినియోగించకుండా, ఎకరాకు లీటరు వేపనూనెను స్ప్రేయింగ్ చేయాలి. తెగుళ్ల అదుపులోకి రానప్పుడు మాత్రమే రసాయన మందులు వినియోగించాలి. స్థానికంగా ఉన్న రైతు భరోసా సిబ్బందిని సంప్రదిస్తే తగిన సూచనలు అందిస్తారు.

– బి.భాస్కరరావు, మండల వ్యవసాయాధికారి,బుచ్చెయ్యపేట.

నేడు జిల్లాస్థాయి ఎడ్లపరుగు పోటీలు

చీడికాడ: దసరా మహోత్సవాల్లో భాగంగా మండలంలోని అప్పలరాజుపురం లలితాదేవి ఆలయం వద్ద శనివారం జిల్లా స్థాయి ఎడ్లపరుగు పోటీలు నిర్వహించనున్నట్టు సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సహకారంతో ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరపనున్నట్టు చెప్పారు.

15న మూడు గ్రామాల్లో పల్లె పండగ

మాడుగుల రూరల్: మండలంలోని మూడు గ్రామాల్లో ఈనెల 15న పల్లె పండగ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కొంకి అప్పారావు శుక్రవారం తెలిపారు. కేజే పురం, తాటిపర్తి, శంకరం గ్రామాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

జయమునీయవే.. జగజ్జనని



సీతయ్యపేట కోనేరులో హంస వాహనంపై దుర్గామల్లేశ్వరి అమ్మవారి ఊరేగింపు



కేజే పురంలో అంబలం పూజలో పాల్గొన్న భవానీ భక్తులు




దేవరాపల్లిలో దుర్గాదేవి మండపం వద్ద లక్ష కుంకుమార్చన చేస్తున్న భక్తులు



సీతయ్యపేటలో కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



కె.జె.పురంలో ఘటాలను ఊరేగిస్తున్న భవానీ భక్తులు



దుర్గా మల్లేశ్వరి అమ్మవారు



తలుపులమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న వైస్ ఎంపీపీ సూర్యనారాయణ, మహిళలు

బుచ్చెయ్యపేట: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు అమ్మవారు మహిషాసుర మర్ధనిగా భక్తులకు దర్శనమిచ్చారు. సీతయ్యపేట దుర్గామల్లేశ్వర్ల అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన హంస వాహనంపై గురువారం రాత్రి కోనేరులో విహరింపజేయగా, జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు అమ్మవారి ఉత్సవాన్ని తిలకించారు. వడ్డాదిలో అమ్మవారి మండపం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించగా,ఎం.బి.పాలెం,లోపూడి తదితర గ్రామాల్లో సారె ఊరేగింపు నిర్వహించారు. బుచ్చెయ్యపేట, తురకలపూడి,విజయరామరాజుపేట, బుచ్చెయ్యపేట,దిబ్బిడి,రాజాం,ఆర్.భీమవరం తదితర గ్రామాల్లో దుర్గాదేవి మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సారె,బోనాల ఊరేగింపు

మాకవరపాలెం: మండలంలోని బూరుగుపాలెంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సారె, బోనాలు ఊరేగించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ మండపం నుంచి మహిళలు, భవాని మాలధరించిన భక్తులు శుక్రవారం సాయంత్రం సారె, బోనాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నివేదించారు. భవానీ భక్తులు శూలాలు వేసుకుని ఊరేగింపులో పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక దేవీతల్లి ఆలయంలో దసరా ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు భారీ ఎత్తున విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాడుగుల జీసీసీ గొడౌన్ వద్ద వెలసిన దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోభారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వంటర్లపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కె.జె.పురం కళావేదిక మీద ప్రతిష్ఠించిన అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. కేజే పురంలో శుక్రవారం రాత్రి భవానీ భక్తుల ఆధ్వర్యంలో ఘటాలు, గరగల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో ప్రతి ఇంటి ముందు ముగ్గులు పెట్టి స్వాగతం పలికారు. ఊరేగింపు అనంతరం స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవానీ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కె.జె.పురం కల్యాణ వేంకటేశ్వర ఆలయంలోఅష్టలక్ష్మికి కుంకుమ పూజలు నిర్వహించారు.

భారీగా అంబలం పూజ

కేజే పురంలో గురువారం రాత్రి భవానీ భక్తులు భారీ ఎత్తున అంబలం పూజ నిర్వహించారు. గ్రామానికి చెందిన కర్రి నారాయణరావు, కొణతాల మురళీకృష్ణ, ఆడారి పెంటయ్యనాయుడు, కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో కళావేదిక వద్ద నిర్వహించిన ఈ పూజలో సుమారు 800 మంది భవానీ భక్తులు పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా శుక్రవారం జానికీరాంపురం, కొండపాలెం ఆంజనేయస్వామి గుడివద్ద, కొండపాలెం తదితర గ్రామాల్లో అన్నసమారాధన నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో దుర్గాదేవికి లక్ష కుంకుమార్చన

దేవరాపల్లి: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా టీటీడీ ఆధ్వర్యంలో శుక్రవారం మన గుడి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి మండపం ప్రాంగణంలో లక్ష కుంకుమార్చనను భక్తి శ్రద్ధలతో జరిపారు. జిల్లా ధార్మిక మండలి సభ్యులు ముళ్లపూడి సత్యనారాయణ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ చల్లా సత్యనారాయణ, కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ పురోహితులు చంద్రమౌళీ, సుశీలమ్మ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.


సామూహిక కుంకుమ పూజలు

కె.కోటపాడు : పాచిలవానిపాలెంలో గల తలుపులమ్మ తల్లి అమ్మవారి ఆలయం వద్ద సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామానికి చెందిన 108 మంది మహిళలు ఈ పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, గండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. గొండుపాలెంలో గల దుర్గాదేవి మండపం వద్ద శుక్రవారం అన్నసమారాధన జరిపారు. గొండుపాలెం, గుల్లేపల్లి, మురుగుపాలెం గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

నర్సీపట్నంలో..

నర్సీపట్నం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట, ఎ.ఎల్.పురం, జోగుంపేట, మల్లంపేట, అమ్మపేట తదితర గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారి మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు.



మాడుగులలో అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు



కొండపాలెంలో అన్నసమారాధనలో ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

వైఎస్సార్‌సీపీ పటిష్టతకు ఐక్యతతో కృషి చేయాలి



బూడి ముత్యాలనాయుడును దుశ్శాలువాతో సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కె.కోటపాడు : వైఎస్సార్‌సీపీ పటిష్టతకు పార్టీ నాయకులంతా ఐక్యతతో పనిచేయాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఇటీవల పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన బూడి ముత్యాలనాయుడును వి.సంతపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. బూడిని కలిసిన వారిలో వి.సంతపాలెం సర్పంచ్ లెక్కల దేవీలత, దేముడునాయుడు, జెడ్పీటీసీ కర్రి సత్యం, లెక్కల సింహాద్రప్పుడు, లెక్కల అర్జున, లెక్కల రాము, సింగంపల్లి వెంకటరమణ, చిరికి నర్సింహమూర్తి, గొలగాన పైడితల్లి, చిరికి సింహద్రప్పడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ అన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం మున్సిపాలిటీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టబోయే కార్యక్రమాలపై నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు నాలుగు నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, ప్రజల పక్షాన ప్రభుత్వంతో పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని చెప్పారు. పార్టీ నాయకులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ లోపాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర, పార్టీ నాయకులు పెట్ల అప్పలనాయుడు, కర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల జారీలో జాప్యం చేయొద్దు



అర్జీదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం: విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేయడంలో జాప్యం చేయవద్దని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. వీఆర్వోలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలు పట్ల సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. రైతుల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, వారి పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా కాపాడే బాధ్యత వీఆర్వోలపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో నాతవరం వీఆర్వో బొత్స శ్రీనివాస్, ఏఎస్‌వో ఉలబాల రాజుబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన కార్యాలయం బయటకు వచ్చి నిరీక్షిస్తున్న ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. మన్యపురట్ల, నాతవరం రైతులతో మాట్లాడి, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో అప్పటి ఉపాధ్యాయులు

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నతపాఠశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2006–07లో టెన్త్ చదివిన 80 మంది విద్యార్థులు పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు సీహెచ్.అప్పలస్వామి, వరప్రసాదం, భాగ్యలక్ష్మి, నారాయణమూర్తి, రాంబాబు, పోతురాజు, యాకా నర్సింహమూర్తి తదితరులను సన్మానించారు. అనంతరం పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సాయంత్రం వరకు ఆటాపాటలతో ఆనందంగా గడిపారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త చంద్ర

మాడుగుల రూరల్: మండలంలోని కేజే పురం 1 వ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త పి.చంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆడపిల్లలను చదవనిద్దాం, ఆడపిల్లలను ఎదగనిద్దాం అన్న నినాదంతో ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు కిశోర బాలికలకు, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ అయా నూకరత్నం తదితర్లు పాల్గొన్నారు.శరన వరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కేంద్రంలో చదువుతున్న చిన్నారి రాపేట సారికను దుర్గామాతగా అలంకరించారు.